
# పార్టీల పారు

## కొవ్వలి (కాటూరి) జ్యోతి



“పిన్నిగారూ, సంక్రాంతికి బొమ్మలు పెట్టాను. సాయంత్రం తప్పకుండా పేరంటానికి రండి,” అంటూ వెండి కుంకుమ భరిణ నించి, చిన్ని చిన్ని వేళ్ళతో కుంకం తీసుకుని పిన్నిగారి నుదుటన బొట్టుపెట్టింది ఎనిమిదేళ్ళ పారు. పసుపు పచ్చని పట్టుపరికిణికి ఎర్రటి అంచు, ఎర్రటి జాకెట్టు, జడకుప్పెలు చామంతి పూలతో సింగారించుకున్న నల్లటి జడ, ముద్దబంతి పూవులా మెరిసిపోతున్న పారుని మురిపెంగా ముద్దు పెట్టుకుంది పిన్నిగారు.

‘మామీ, సాయంత్రం బొమ్మ కొలూక్కు కట్టా యమా వాంగ,’ అంటూ బొట్టు పెట్టింది పన్నెండేళ్ళ పారు. కాళ్ళకు గజ్జెలు ఘల్లు ఘల్లుమంటుంటే, నారింజరంగు పట్టు పరికిణీ, జరీ అంచు జాకెట్టు, తలనిండా కనకాంబ రాలతో మామీ ఇంటి మెట్లు దిగి, పిన్నిగార్ని దసరా బొమ్మల కొలువుకి పిలిచేందుకు వెళ్తోంది పారు.

‘ఆజ్ షామ్‌కో హమారే ఘర్ మే లక్ష్మీ పూజా హై. ఆప్ జరూర్ ఆనా,’ బహన్‌జీకి కుంకం అందిస్తూ అంది పదహారేళ్ళ పారు. తెల్లటి పట్టు పరికిణీ, జరీబూటాల తెల్లటి జార్జెట్ వోణీ, తలనిండా మల్లెపూలు తురుముకుని ఛంగు ఛంగున మేడ మెట్లు దిగి దీపావళి పేరంటానికి పిలిచేందుకు పిన్నిగారింటివైపు దారితీసింది పారు.

‘చూశావా, నువ్వు బొట్టు పెట్టి పిలవకపోయినా, మా పారుని పెళ్ళికూతుర్ని చేస్తున్నాం అని మీ అమ్మ చెప్పగానే అందరం కట్టకట్టుకుని వచ్చేశాం,’ అంటూ పిన్నిగారు ముందర వస్తే, మామీ, బహన్‌జీ తదితరులు ఇంట్లోకి అడుగు పెట్టారు. ఆకుపచ్చని పట్టుచీరలో, కదంబమాల జడలో తురుముకుని, నుదుట కళ్యాణం బొట్టు, బుగ్గన చుక్కలతో, సిగ్గుతో ముడుచుకుపోతున్న పారు అందాన్ని కళ్ళార్పకుండా చూస్తున్నారు ముత్తైదువులు.

‘పారూ, అమెరికాకి వెళ్ళి మమ్మల్ని మరిచి పోవుగా?’ కళ్ళనిండా నీళ్ళతో అడిగింది నీరూ. ‘అదేమిటే మన పారు పేరంటాలు, పార్టీలు లేకపోతే వారం గడవదాయే. అమెరికాలో దాని ఇంటి గృహప్రవే శానికి మనందరికి టికెట్లు పంపి పిలిపించుకుని పార్టీ ఇస్తానని ప్రామిస్ చేసింది,’ అన్న రూప మాటలు వింటూ కిలకిలా నవ్వారు పారు ఫేర్‌వెల్ పార్టీకి విచ్చేసిన స్నేహితురాళ్ళు.

❁ ❁ ❁ ❁ ❁

బాత్ రూమ్ నించి షవర్ నీళ్ళ శబ్దం వినిపిస్తే చటుక్కున తలెత్తి చూశాడు, గడియారం వంక గిరీష్ ఉరఫ్ గిరీశం. ప్రొద్దున్న నాలుగు గంటలయింది. ఆ రోజు శనివారం అని జ్ఞాపకం వచ్చింది. దుప్పటి ముఖం పైకి లాక్కుని మళ్ళీ నిద్రపోయాడు. ‘ర్ ర్’ మంటూ మిక్సీ శబ్దం విన్న గిరీష్ విసుగ్గా గడియారం వంక చూశాడు. సమయం 7 గంటలు. కోపంగా మంచం దిగి వంట గది వైపు విసురుగా నడిచాడు. అక్కడ తడి ఆరని కురులని ముడివేసుకుని, చీర కొంగుని నడుం చుట్టూ బిగించి, ఎంతో ఏకాగ్రతతో మినపప్పు రుబ్బుతోంది పారు. ఆ అందమైన మొహాన్ని చూస్తూనే అతని కోపం అంతా మటుమాయ మైంది. ఆ సన్నని నడుం చుట్టూ చేతులు బిగించి ‘గుడ్ మార్నింగ్ డార్లింగ్. ఇవ్వాళ శనివారమే కదు టోయ్. మిక్సీకి ఇంత ప్రొద్దున్నే పనిపెట్టేప్రక్క ఎపార్ట్‌మెంట్ వాళ్ళు న్యూసెన్స్ అంటూ ఫోన్ చేస్తారు మేనేజ్‌మెంటుకి. అంతేకాకుండా నాకు మహా చలివేస్తోంది. కాస్సేపు వెచ్చగా....,’ గిరీష్ మాట పూర్తి కాకుండానే పారు అందుకుంది“ అదేంటండీ, నా వైవాహిక జీవితంలో ఇవ్వాళ మొట్ట మొదటి పార్టీ. ఈ రోజు త్వరగా లేవకపోతే ఎట్లా?” సున్నితంగా అతని పట్టు విడిపించుకుని మిక్సీ లోంచి గారెల పిండిని గిన్నెలోకి తీస్తోంది పారు. వచ్చే కోపాన్ని మింగుతూ బెడ్ రూం వైపు నడిచాడు గిరీష్.

❁ ❁ ❁ ❁ ❁

‘వచ్చే ఆదివారం మా వెడ్డింగ్ ఆనివర్సరీ. మీరూ, మీ శ్రీవారూ, పిల్లలూ తప్పకుండా ఆరు గంటలకి రండి... అవునండీ, చాలా మందినే పిల్చాను. చోటు చాలదని కింద పార్టీ రూం తీసుకున్నాం.....’ టి.వి. ముందర కూర్చున్నా పారు ఫోన్ సంభాషణ చికాకు పరుస్తోంది

గిరీష్‌ని. హాయిగా మొదటి యానివర్సరీకి నయాగరాలో మంచి హెూటల్లో హనీమూన్ స్వీట్‌లో గడుపుదామని ఎంతో నచ్చ చెప్పాడు గిరీష్. ససేమిరా వీలు కాదంది పారు. ఈ వారం అంతా మెన్యూ కోసం సంప్రదింపులు, గ్రాసరీ షాపింగ్, పార్టీ రూం క్లీనింగ్ వీటితో గడిచి పోతుంది. వచ్చే వారం అంతా మళ్ళీ క్లీనింగ్, పార్టీలో మిగిలి పోయిన వంటకాలన్నీ ప్రతి రాత్రీ టేబిల్ పైన ప్రత్యక్షం అవటం, పార్టీ బాగా జరిగిందంటూ అందరూ ఫోన్లు చెయ్యటం, మధ్య మధ్యలో, వాళ్ళ గురించీ వీళ్ళ గురించీ తిట్టుకోవటం, చాడీలూ.....



* * * * *

'బ్రహ్మాండమయిన ఇల్లు కట్టావోయ్ గిరీష్. ఇంక ఓ అబ్బాయినీ, అమ్మాయినీ సృష్టించి మిలి యనీర్ క్లబ్‌లో చేరిపో,' అన్న రాధాకృష్ణగారి మాటలకి చిరునవ్వు చిందించాడు గిరీష్. 'పారు పార్టీలకి ఎప్పుడూ ఏ వంకా పెట్టలేం. అందులో ఇంత చక్కటి ఇంటి గృహప్రవేశం చేస్తున్నప్పుడు, ఆవిడ మనకి పెళ్ళి భోజనం పెట్టడంలో ఆశ్చర్యం ఏమీ లేదు,' అంది కరుణ. 'మేడ మీద ఐదు గదులున్నాయి, నలుగురు కాకపోయినా ఎట్లీస్ట్ ఒక అబ్బాయినీ, ఒక అమ్మాయినీ....' 'తాంబూలం తీసుకోండి, వరూధినీ,' మధ్యలోనే వరూధిని మాటలని త్రుంచి వేస్తూ తాంబూలం అందించింది పారు. ఆమె మొహం ఎర్రగా కందిపోయింది క్షణంలో. తెల్లటి పారు శరీరంపై ఎర్రటి చీరవల్ల అలా అనిపిస్తోందా, లేక తనేమైనా అనకూడని మాట అన్నానా, అనుకుంటూ నాలిక్కరుచుకుంటూ తాంబూలం అందుకుంది వరూధిని.

'ఏవోయ్. ఇండియానించి మనవాళ్ళెవరూ లేరనే కానీ, మన ఇంటి గృహప్రవేశం బ్రహ్మాండంగా జరిగింది కదూ. బేస్‌మెంట్‌లో రిక్రియేషన్ రూం చాలా బాగుంది అని అందరూ అన్నారు. ఇక నీ దసరా, సంక్రాంతులూ, వేలెంటైన్, క్రిస్టమస్ పార్టీలు అన్నీ అక్కడ దర్జాగా జరుపుకోవచ్చు,' అన్నాడు గిరీష్. 'ఎన్ని పార్టీలు జరిపితే ఏం. పిల్లల పార్టీలు జరపలేం కదా,' కంటినిండా నీటితో బేలగా అతని వంక చూసింది పారు. 'పోన్లే పారూ, నాకు నువ్వు, నీకు నేను. అందుకే మనిద్దరి పేర్లు కూడా అంత బాగా కలిశాయేమో. ఏడవకు పారూ. భగవంతుడు మనకింతే రాసిపెట్టాడు,' ఆమె మొహాన్ని తన రెండు చేతల మధ్య తీసుకుని నచ్చ చెప్పాడు గిరీష్.

* * * * *

వాకిట్లో ఉన్న దీప స్తంభానికి కట్టిన రంగు రంగుల బెలూన్లు గాలిలో ఎగురుతున్నాయి. 'కమానిన్ అండ్ పార్టీ,' అని రాసిన పెద్ద పోస్టర్ తలుపుమీద అంటించి ఉంది. రోజా రంగు పార్టీ డ్రస్, తెల్లటి పార్టీ షూస్ వేసుకుని వాకిట్నించి ఇంట్లోకి, ఇంటినించి వాకిట్లోకి వందమాట్లు పరుగులు తీస్తోంది పాప. అదిగో ఎదురు చూసిన మొదటి గెస్ట్ రానే వచ్చింది. చేతిలో పెద్దపాకెట్‌తో కారు దిగి, 'హ్యాపి బర్త్‌డే,' అంటూ అరుస్తూ పాప దగ్గరకి పరుగులు తీస్తోంది ఇంకో చిన్నారి. పొడుగాటి వేళ్ళతో బుగ్గలమీద జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ కిటికీ కర్టెన్‌ల దగ్గర్నించి వెనక్కి తిరిగింది పారు. 'ఎదురింటి ఏలి సన్ పుట్టిన రోజు పార్టీ కామోసు,' అన్నాడు భార్య ముఖాన్ని పరిశీలనగా చూస్తూ గిరీష్. 'ఊ', ముక్తసరిగా సమాధానం.


'చూడు పారూ, రోజురోజుకీ ఇలా డీలా పడిపోతే ఎలా? అన్ని టెస్టులూ చేయించుకున్నాం. పిల్లలు పుట్టరని ఖచ్చితంగా అంటున్నారు డాక్టర్లు. ఇక దాని గురించి ఆలోచిస్తూ నువ్విలా అయిపోతే నేనేం చెయ్యను? పోనీ ఉద్యోగం చెయ్యమంటే ఉన్న డబ్బు చాలదా అంటావు. మునపట్లాగా పార్టీలు ఇవ్వటం మానేశావు. నువ్వూ వెళ్ళటం లేదు. పోనీ నేనేమైనా చేయగలిగింది ఉంటే చెప్పు. నిన్నిలా చూడలేను పారూ,' బాధగా అంటూన్న గిరీష్ ఛాతీ మీద ఒరిగిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది పారు. 'ఏమైనా సరే. ఈ సమస్యకి ఒక పరిష్కారం తనే వెదకాలి,' మనస్సులో ధృఢంగా నిశ్చయించుకున్నాడు గిరీష్.

* * * * *

'ట్రింగ్ ట్రింగ్, మంటూ ఫోన్ మోగింది. 'పారు పార్టీ ప్లేస్! కెన్ ఐ హెల్ప్ యూ?' అంటూ తియ్యటి కంఠం వినబడింది. 'నేనండీ పారూ, వరూధినిని. ఎలా ఉన్నారు? ఏం లేదు. మా అవంతి పుట్టినరోజు పార్టీకి మీ హాల్ బుక్ చేద్దామని ఫోన్ చేస్తున్నాను.' 'చాలా సంతోషమండీ. ఎన్నో తారీఖున? ఎంత మందికి ఎరేంజ్ చెయ్యాలి? పిల్లలకి మటుకేనా? కేక్ వగైరాలు నన్నే సప్లయ్ చెయ్యమంటారా? మీకు ఎంటర్‌టైన్‌మెంట్ కావాలంటే నేనే క్లౌనో, మెజీషియనో కుదురుస్తానులెండి... అట్లాగే... అన్నీ కనుక్కున్న తర్వాత ఎంత డబ్బవుతుందో మీకు ముందరే ఎస్టిమేట్ ఇస్తానులెండి. ఇంకా ఏమిటి విశేషాలు?'

'మొన్న మీ పార్టీ ప్లేస్‌లో మెహతా వారి అమ్మాయి ఎంగేజ్మెంట్ పార్టీ చాలా బాగుందని అందరూ అంటున్నారండీ. వందమందికి వంటలు ఎలా సప్లయ్ చేశారండీ?' అడిగింది వరూధిని. 'మీకు తెలీదా? ఇండియానించి మా అత్తయ్యవచ్చింది. తనకి చాలా చిన్నప్పుడే భర్త పోయారు. వాళ్ళబ్బాయికి పదిహేనేళ్ళు. వాడ్ని ఇక్కడ స్కూల్లో చేర్పించాం. అత్తయ్య, నేను కలిసి ఈ పార్టీ ప్లేస్ నడుపుతున్నాం. వంటలన్నీ మేమే చేస్తున్నాం. ఇద్దరం కలిసి కమ్యూనిటీ కాలేజీలో బేకింగ్, కేటరింగ్ క్లాసులకి వెళ్ళి అన్నీ నేర్చుకున్నాం. అందువల్ల ఇక్కడి వంటలు కూడా సప్లయ్ చెయ్యగలం.'

'చాలా బాగుందండీ. మన ఇండియన్లకి అందు బాటులో చక్కటి పార్టీ ప్లేస్ పెట్టారు. పార్టీలు మటుకేనా, వేరే ఏవైనా చేస్తున్నారా?' అడిగింది వరూధిని. 'పార్టీలే కాదండి. ఒంట్లో బాగుండకో, లేదా వేవిళ్ళతో బాధ పడుతూనో కమ్మని వంటల మీద మనసుపడుతున్న గృహిణులకూ, కాలేజీ స్టూడెంట్లకీ, భార్య ఇండియాకి వెడితే చేతులు కాల్చుకుంటున్న మగ మహారాజులకీ, ఎవరికైనా సరే రెండు గంటలు టైమిస్తే వారింటికి కారియర్‌లో వేడి వేడి ఆంధ్రుల భోజనం సరఫరా చేస్తాం' హాయిగా నవ్వుతూ అంది పారు. 'ఏమీ అనుకోవద్దు. ఇంకో లైను మీద ఫోన్ వచ్చింది. మీ ఎస్టిమేట్‌తో సాయంత్రానికల్లా మీకు మళ్ళీ నేనే ఫోన్ చేస్తాను. బై. థాంక్యూ ఫర్ కాలింగ్,' అంటూ ఈ లైన్ కట్ చేసి, పక్క బటన్ నొక్కి, 'పారు పార్టీ ప్లేస్, కెన్ ఐ హెల్ప్ యూ?' మధురంగా అడుగుతోంది పార్టీల పారు. ❑



శ్రీమతి కొవ్వలి (కాటూరి) జ్యోతి పుట్టి పెరిగింది మద్రాసులో. మద్రాసులో ఫిజిక్స్‌లో ఎమ్.ఎస్సీ. కెనడాలో సర్టిఫైడ్ జనరల్ ఎక్కౌంటెంట్. ఏడెనిమిదేళ్ళ వయస్సు నించి మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమైన ఎన్నో నాటికలు, చర్చలు, ఆటవిడుపు, మహిళా మండలి వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భర్త శ్రీ సత్యనారాయణ. పిల్లలు అనిల్, శిల్పలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఉద్యోగానికి స్వస్తి చెప్పారు. 'జీవితం వడ్డించిన విస్తరి కాకపోయినా, పంచభక్ష్య పరమాన్నాలు మనమే వండుకుని, వడ్డించుకున్న విస్తరిగా మార్చుకునే శక్తి మనలోనే ఉంద'న్నది వీరి గట్టి నమ్మకం. షికాగోలో జరిగిన (జూలై 1995) దశమ తానా తెలుగు మహా సభల సందర్భంగా వెలువడిన 'తెలుగు పలుకు' సంచికలో ప్రచురితమైనదీ కథ.